# ఇదికూడా ప్రేమేనా?

భిలాస్‌పూర్‌కి దాదాపు రెండు వందల కిలోమీటర్ల దూరంలో బాల్కోలో ఒక అల్యూమినియం కంపెనీ వుంది. మధ్యప్రదేశ్‌లోని ఈ కంపెనీ ప్రపంచఖ్యాతి గాంచింది.

ఈ అల్యూమినియం కంపెనీ ఒక ఆస్పత్రిని కూడా నిర్వహిస్తున్నది. ఈ ఆస్పత్రికి సంబంధించిన లాబ్‌లో సంతమసీహ్ అనే ఒక యువకుడు పనిచేస్తూండేవాడు. అదే ఆసుపత్రిలో నర్సుగ పనిచేస్తున్న విమల అతని భార్య. అన్యోన్యంగా జీవిస్తున్న ఆ జంటకు ఇద్దరు బిడ్డలున్నారు.

విమల తండ్రి హీరాలాల్ తకత్‌పూర్‌లోని ఒక చర్చిలో మతాధికారి. విమల తమ్ముడు-ఇరవై మూడు సంవత్సరాల మూసామసీహ్.

మూసాని తండ్రి పెద్ద చదువులు చదివించాలనుకున్నాడు. కాని చిన్నప్పటి నుంచే తాగుడు, జూదం వగైరాలు నేర్చిన మూసా తండ్రి ఆశయాలకు సమాధి కట్టాడు. పైగా పని చేయటమంటే అతని కిష్టం వుండేది కాదు. ఉదయం చక్కగా ముస్తాబై బయటికి వెళ్ళిపోవడం,

స్నేహితుల్తో ఊరంతా బలాదూరు తిరగడం అతనికి అలవాటయింది. హీరాలాల్ కొడుకుని చూసి బాధపడేవాడు. కూర్చోబెట్టి గంటల కొద్దీ బుద్ధులు చెప్పేవాడు. అయినా అతని మీద తండ్రి ఉపదేశాల ప్రభావం పడలేదు.

/

## పుష్పతో పరిచయం

ఒకసారి సంతమసీహ్ విమలతో పాటు ఆమె పుట్టింటికి వచ్చి నప్పుడు మామగారు అల్లుడి దగ్గర తన కొడుకును గురించి ఎంతో బాధ పడ్డాడు. మూసాను తనతో తీసుకెళ్ళి ఏదైనా పని ఇప్పించి మంచి మార్గంలో పెట్టడానికి ప్రయత్నిస్తానని సంత్ మామగారిని ఓదార్చాడు. మూసా అయిష్టంగానే అక్కా బావలతో బాల్కోకి వచ్చారు. అక్కడే పుష్పను మూసా మొదటిసారిగా చూశాడు. పుష్ప సంత్కి చెల్లెలు. ఆమె వయస్సు ఇరవై ఒక్క సంవత్సరాలు. బిలాస్పూర్లో బి. యస్. సి చదివింది. చాలా చురుకైన పిల్ల. మంచి మార్కులతో ఫస్టుక్లాసులో పాసయింది.

పుష్ప అంటే విమలకు కూడా ఎంతో ప్రేమ. క్రిష్టియన్ మిషన్ ద్వారా పుష్పను అమెరికా పంపించే ఏర్పాటు జరిగింది. కాని అన్నకి చెల్లెలంటే ప్రాణం. అంతదూరం పంపడానికి ఇష్టపడలేదు. ఎం.ఎస్.సి చదివింది. తరవాత పి. హెచ్. డి. చేయించాలని అన్న కోరిక.

పుష్ప నవ్వుతూ తిరుగుతూ చలాకీగా ఇంటిపని చేస్తుండేది. సాయం సమయాల్లో టైపు ఇనిస్టిట్యూట్కి వెళ్ళి టైపు నేర్చుకునేది.

మూసాను సంత్ ఒక కాంట్రాక్టరు దగ్గర ఉద్యోగంలో నియమించాడు. మొదటి నెల జీతం మాత్రం తెచ్చి అక్క చేతికిచ్చాడు. రెండో నెల నుంచీ స్నేహితులూ, తిరుగుడూ ప్రారంభం అయ్యాయి. చేతిలో డబ్బుండటం వలన ముందు కంటే కూడా ఘోరంగా తయారయ్యాడు. బావా, అక్కా కూడా కోపగించుకున్నారు. అయినా అతను లక్ష్య పెట్టలేదు. ఒక్కో రోజు బాగా తాగి ఇంటికి వచ్చేవాడు. ఇరుగు పొరుగు వాళ్ళల్లో కూడా మూసా అంటే చిన్న చూపు ఏర్పడింది.

పుష్పకి అతన్ని చూస్తే భయంగా వుండేది. అతను అదోలా ఆమెకేసి చూసేవాడు. అతని కళ్ళల్లో కాంక్ష స్పష్టంగా కనిపించేది. బాబ్డ్ హెయిర్ తల్లని మెడమీద పడుతూ పుష్ప అందంగా వుంటుంది. ముఖంలో అమాయకత్వం నింపుకొన్న పెద్ద పెద్ద కళ్ళు ఆమెను ఒక్కసారి చూసిన వాళ్ళు వెంటనే దృష్టి మరుల్చుకోలేరు.

మూసా పుష్ప మీద తనకేదో అధికారం వుందని అనుకోసాగాడు. తన వదినెకు తమ్ముడు గనక ఆ అమ్మాయి అతణ్ణి మర్యాదగా చూసేది. అతను పలకరించినప్పుడు మామూలుగా నవ్వుతూ సమాధానం ఇచ్చేది. దానితో ఆ అమ్మాయి తనని ప్రేమిస్తున్నదని ఆ మూర్ఖుడు తలచాడు. పుష్ప గురించి కలలు కనేవాడు.

ఒక రోజు సాయంత్రం పుష్ప వాకిట్లో కూర్చుని నవల చదువుకుంటున్నది. అన్నా వదినా డ్యూటీకి వెళ్ళారు. మూసా కూడా ఇంకా రాలేదు.

"పుష్పత్తయ్యా" అంటూ వెనకనుంచి పిలుపు వినిపించింది. పుష్ప వెనక్కి చూస్తూనే "రా, రంజన్! కూర్చో! ఏమిటి బొత్తిగా నల్ల

పూనవై పోయావు...." అంటూ పలకరించింది. పక్కనే నేలమీద కూర్చొంటూ కబుర్లు మొదలు పెట్టాడు రంజన్ రంజన్ పుష్పా వాళ్ల పక్కింట్లో ఉంటాడు. హైస్కూల్లో చదువు తున్నాడు. వయసు పదిహేను సంవత్సరాలు. పుష్పకి ఆ పిల్లవాడంటే ఎంతో ఇష్టం. పరీక్షల ముందు అతనికి తెలియని పాఠాలు తను చెప్పేది. రంజన్ కూడా పుష్పను "అత్తా" అని పిలుస్తూ గలగలా మాట్లాడేవాడు! ఆ రోజు రంజన్, పుష్ప కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. రంజన్‌తో పాటు పసి పిల్లలా పుష్ప కూడా పకపక నవ్వుతోంది. అదే సమయంలో మూసా వచ్చాడు. వాళ్ళిద్దర్నీ అలా చూసి ఈర్ష్యపడ్డాడు. కామంతో ఉచితానుచితాలు మరచిన మూసా వారిద్దరి మధ్య వున్న వయోభేదాన్ని కూడా ఆలోచించే స్థితిలో లేడు. ఇంటి లోపల కాలుకాలిన పిల్లిలా తిరుగుతున్నాడు.

రంజన్ వెళ్ళిపోయాడు. పుష్ప లోపలికి వచ్చింది. "సరసాలు అయిపోయాయా? ఆనుకుని ఆనుకుని కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు ఏమిటి విశేషం?" అన్నాడు మూసా.

అతని వ్యంగ్యానికి పుష్ప స్థాణువులా నిలబడిపోయింది. మరు క్షణం కోపంతో పణికిపోతూ, ''పిచ్చి పిచ్చిగా వాగకు జాగ్రత్త!'' అన్నది.

"ఓస్ నాకు తెలియదనుకుంటున్నావా ఏం మీ వేషాలు? నేను చూస్తూనే వున్నాను. మళ్ళీ వాడితో మాట్లాడినట్టు చూశానా- జాగ్రత్త! నేనసలే మంచివాణ్ణి కాదు.... '' అధికారంగా అన్నాడు.

''ఏం చేస్తావేమిటి? ఒకసారి కాదు వందసార్లు మాట్లాడతాను నువ్వెవడివి నాకు నీతులు చెప్పడానికి?'' అని కోపంగా సమాధానం ఇచ్చింది పుష్ప.

"నేనెవణ్ణా?'' పళ్ళు పటపట కొరికాడు. మరుక్షణం కోపంగా బయటికి వెళ్ళిపోయాడు.

కొన్ని రోజులు ఇద్దరూ మాట్లాడుకోలేదు. ఇది గమనించి ''ఏమ్మా? వాడు నిన్నేమైనా అన్నాడా?'' అని విమల అడిగింది. ఇంట్లో కలతలు రేపటం ఇష్టంలేక పుష్ప ఏం లేదన్నది. తరువాత మూసాతో మామూలుగానే మాట్లాడసాగింది. మూసా పని మానేశాడని తెలిసి అక్కా, బావా అతనితో మాట్లాడ్డం మానేశారు. ఒకరోజు ఇంట్లో ఎవరూ లేకుండా చూసి మూసా పుష్ప దగ్గరకెళ్ళి కూర్చున్నాడు.

"ఉద్యోగం మానేశావేం బావా?" అని పుష్ప మామూలుగా అడిగింది. "పనిచెయ్య బుద్ధి పుట్టడంలేదు!''

''బాగుంది! పనిచెయ్యకపోతే జీవితం ఎలా గడుస్తుంది?"

"ఒంటరివాణ్ణి! ఎలాగో అలా అదే గడిచిపోతుంది"

అతని మాటలకు పుష్ప కిలకిల నవ్వింది.

''జీవితం అంతా ఇలాగే వుండిపోతావా ఏం?" అన్నది అమాయకంగా.

''ఉండిపోతాను పుష్పా, నచ్చిన భార్య దొరక్కపోతే!''

''ఎలాంటి భార్య కావాలేమిటి?"

"నీలాంటి భార్య కావాలి. అచ్చం నీలాగే వుండాలి. పుష్పా నిజం చెప్తున్నాను. నిన్ను నేను ప్రాణప్రదంగా చూసుకుంటాను. నిన్ను ప్రేమిస్తున్నాను. నన్ను పెళ్ళి చేసుకుంటావా?'' అని ఆమె చేతులు పట్టుకున్నాడు.

ఒక్కక్షణం పుష్పకి గుండె ఆగినట్లయింది. కళ్ళప్పగించి చూస్తూ వుండిపోయింది. మరుక్షణం తన చేతులు వెనక్కి లాక్కుంది. రోషంతో ఆమె ముఖం ఎర్రబడ్డది.

"నీకెంత ధైర్యం? నేను నిన్ను పెళ్లి చేసుకోవాలా...."

''నిన్ను ప్రేమిస్తున్నాను పుష్పా! నా ప్రేమను తిరస్కరించకు"

''నేను నిన్ను ప్రేమించడం లేదు. ప్రేమించలేను. పిచ్చి ఆలోచనలు వదిలెయ్'' విసురుగా వెళ్ళిపోయింది పుష్ప.

మూసా కోపంగా బయటికి వెళ్లిపోయాడు.

పుష్ప మధనపడసాగింది. 'అతనితో మాట్లాడకుండా వుంటే బాగుండేది. అన్నయ్యతో చెబితే? ఊహూఁ చెప్పకూడదు! తనవల్ల కుటుంబంలో కలహాలు రాకూడదు. వదిన ఎంతో మంచిది. తమ్ముడికి జరిగిన అవమానాన్ని ఎలా తీసుకుంటుందో!' ఇలా ఆలోచించిన పుష్ప ఈ విషయం అన్నకుగాని, వదినకు గాని చెప్పలేదు. ఆరోజు నుంచి మూసా రోజూ తాగి ఇంటికి రావడం ప్రారంభించాడు. బావతోనూ, అక్కతోనూ ఘర్షణపడ్డాడు. "ఈ నిముషంలోనే వెళ్లిపో బయటికి. నిన్నేదో బాగుచేద్దామని తీసుకొచ్చాను. నీలో ఆ లక్షణాలులేవు!" అన్నాడు బావ.

ఆ మర్నాడు మూసా కూరగాయలు కోసుకునే చాకును బావ గారింటి ముందున్న రాతిమీద పదును పెడుతున్నాడు. ఒక పక్కింటి అతను "ఏమోయ్ మూసా చాకుకు పదును పెడుతున్నావా!" అన్నాడు.

"కోడి మెడ కొయ్యడానికి!'' తలెత్తకుండానే సమాధానం ఇచ్చాడు.

ఆ విషయాన్నెవరూ సీరియస్‌గా తీసుకోలేదు. ఆరోజు రోడ్డు మీద ఒక వంతెన మీద కూర్చుని వుండగా రంజన్ కనిపించాడు. అతను ఫుట్‌బాల్ ఆడి వస్తున్నాడు. రంజన్‌ని చూసి మూసా వంతెన దిగాడు. మూసా పిలుస్తున్నా వినిపించుకోకుండా రంజన్ పరుగులాంటి నడకతో రోడ్డుమీదకి వెళ్ళి జనంలో కలిసిపోయాడు.

రెండోరోజు మూసా తన దుస్తులు తీసుకుని వెళ్ళిపోతూ వుంటే విమల అతన్ని ఆపటానికి ప్రయత్నించింది. అతను వినిపించుకోలేదు. చివరికి విసుగుపుట్టి అక్క కూడా పొమ్మంది. ఆరోజు బయటికి వెళ్ళి తన బట్టల సంచిని ఒక పాన్ దుకాణంలో పెట్టాడు.

మరునటి రోజు మూసా బావగారింటికి వచ్చాడు. విమల డ్యూటీకి హాస్పిటల్‌కి వెళ్ళింది. సంత్ కూడా ఏదో పనిమీద బయటికి వెళ్ళాడు. పిల్లల్ని ఆడుకోవటానికి పక్కింటికి పంపించి పుష్ప రొట్టెలకి పిండి కలుపుతూ వంటింట్లో వుంది. అటు తిరిగివున్న పుష్ప మీద మూసా చాకుతో పొడిచాడు. ఆమె ఆర్తనాదం చేసింది. వీపులో గుచ్చిన చాకును లాగేశాడు. ఒక్కసారిగా రక్తం చిమ్మింది. రక్తపు మడుగులో పడిన పుష్ప కళ్ళకి మూసా కనిపించాడు.

"రక్షించండి! రక్షించండి!" అంటూ ఆమె కేకలు పెట్టింది.

పక్కింటి విభూచరణ్ నందా పరిగెత్తుకుని వచ్చాడు. అతను వచ్చేసరికి మూసా పుష్ప ఛాతీలో కత్తితో పొడుస్తున్నాడు పిచ్చివాడిలా. నందా వెనకనుంచి మూసా చేతులు పట్టుకున్నాడు. నందా కూడా కేకలు పెడుతున్నాడు. ఇంతలో మరికొందరు వచ్చారు. అందరూ వచ్చి మూసాను పట్టుకున్నారు. కొందరు పుష్పను రిక్షాలో హాస్పటల్‌కి తీసుకెళ్ళారు. మూసా అదను చూసుకొని, పట్టు విడిపించుకుని గదిలోకి

పరిగెత్తి తలుపులు వేసుకున్నాడు. జనం తలుపులు పగలగొట్టి లోపల ప్రవేశించి సీలింగ్ ఫాన్‌కి తాడు బిగించి ఉరి వేసుకునే ప్రయత్నంలో ఉన్న మూసాను పట్టుకున్నారు. ఇది జరిగిన ఇరవై నిముషాలకి ఇంటికి వచ్చిన సంత్ ఈ ఘోరాన్ని వింటూనే స్కూటర్ వెనక్కి తిప్పి పుష్పను చూడటానికి హాస్పిటల్‌కి వెళ్ళాడు.

పుష్ప చనిపోయింది.

మూసా స్పృహ కోల్పోయినట్టు పడిపోయాడు. డాక్టర్లు పరీక్షించి అతను ఆరోగ్యంగావే ఉన్నాడని, నాటకం ఆడుతున్నాడనీ చెప్పారు.

మానసికంగా, శారీరకంగా అలసిపోయిన మూసా తన అప రాధాన్ని వెంటనే ఒప్పుకున్నాడు. మూసాకు కోర్టులో 1980 జూలై ఒకటవ తేదీన ఆజన్మ కారాగార శిక్షను విధించడం జరిగింది. న్యాయ మూర్తి తీర్పు వినగానే మూసా తలవంచుకున్నాడు.

ప్రస్తుతం హైకోర్టులో అప్పీలుమీద కేసు నడుస్తోంది.